

కార్ల క్యూ..



కోదాడ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తున్న కార్లు

హైదరాబాద్ నుంచి పోటెత్తిన కార్లు

ఎన్‌హెచ్-65పై ఒకటే రద్దీ

కిలోమీటర్ల కొద్దీ బారులు తీరిన ట్రాఫిక్

కీసర టోల్‌ప్లాజా వద్ద రికార్డుస్థాయిలో 65వేల కార్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల) : పండుగ ప్రయాణం పోటెత్తింది. అంచనాలకు మించి హైదరాబాద్, ఇతర దూరప్రాంతాల నుంచి బెజవాడకు ప్రయాణికులు కదిలారు. 65వ నెంబర్ జాతీయ రహదారి కిటకిటలాడింది. కీసర టోల్‌ప్లాజా వద్ద ఇసకేస్తే రాలనంత కార్లు బారులు తీరి కనిపించాయి. హైదరాబాద్ నుంచి రికార్డు స్థాయిలో ప్రయాణికులు రావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. రోజుకు 3 లక్షల మంది వస్తారని అంచనా వేయగా, 6 లక్షలకు పైగా వచ్చారు. శనివారం అంచనాలు మించి 3 లక్షల మంది పెరిగారు. హైదరాబాద్ మహానగరంలోని ఓలా, ఉబర్, జూమ్ తదితర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ట్యాక్సీ ఏజెన్సీ సంస్థలన్నీ ఏపీకి క్యూ కట్టాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 50 వేల పైచిలుకు కార్లు విజయవాడ వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శనివారం రాత్రి 7 గంటల వరకు 65 వేల కార్లు వచ్చినట్టుగా టోల్‌ప్లాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన మరో 2.60 లక్షల మంది ప్రయాణికులు కార్లలో విజయవాడ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎన్‌హెచ్-65పై వస్తున్న కార్ల దండును కొందరు డ్రోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విజయవాడకు భారీ సంఖ్యలో కార్లు వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కనకదుర్గ ఫ్లై ఓవర్, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్లపై రద్దీ కనిపించింది.



కీసర టోల్‌గేట్ వద్ద బారులు తీరిన కార్లు

పుంజుకున్నాయ్



ఈడుపుగల్లులో వైసీపీ జెండాలతో బరులు

రెండు జిల్లాల్లో భారీగా కోడిపందేల బరులు

- అధికార పార్టీ నేతల అండతో పకడ్బందీ ఏర్పాట్లు
- పందేల కోర్టుల వద్ద ఫ్లడ్‌లైట్లు
- రూ.కోట్లలో లావాదేవీలు
- హైదరాబాద్ నుంచి వచ్చిన పందెపురాయుళ్లు
- విజయవాడలోని హోటళ్లలో బస
- నేటి నుంచి కోళ్లతో రంగప్రవేశం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ నేతలు జూదాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లాలో ఖాళీ స్థలాల్లో, తోటల్లో టెంట్లు వేశారు. భూమి చదును చేసి కోడిపుంజులు కొట్టుకోవడానికి అనువుగా కోర్టులు ఏర్పాటు చేశారు. అన్ని మండల కేంద్రాల్లోనూ, శివారు ప్రాంతాల్లోనూ బరులు, గిరులు కనిపిస్తున్నాయి. ప్రతి బరి వెనుక అధికార పార్టీ నేతలు ఉండటంతో పోలీసులు చూసీచూడనట్టే వ్యవహరిస్తున్నారు.

రూ.5 లక్షల నుంచి ఆరంభం

భోగి నుంచి కనుమ వరకు జరిగే కోడిపందేలు, పేకాటల్లో కోట్లాది రూపాయలు చేతులు మారబోతున్నాయి. కోడిపందేల బరుల వద్ద ప్రారంభ పందేన్ని రూ.5 లక్షలుగా నిర్ణయించినట్టు కొంతమంది చెబుతున్నారు. బరుల వద్దకు భారీగా జనం రాకుండా కొన్నిచోట్ల నిర్వాహకులు పాసులు జారీ చేసినట్టు చెబుతున్నారు. మూడు రోజులపాటు ఈ బరుల వద్ద బసచేసే వారికి ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. ఏటా సంక్రాంతికి హైదరాబాద్ ఖాళీ కావడం ఒక సంప్రదాయం. అక్కడి నుంచి భారీసంఖ్యలో పందేల కోసం ఇక్కడికి వస్తుంటారు. వారంతా విజయవాడలోని హోటళ్లలో బస చేస్తారు. కోడిపందేలు, లోపల-బయట ఆటల ద్వారా భారీగా డబ్బులు వెనకేసుకోవాలని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈసారి ఎన్టీఆర్ జిల్లాలో రూ.10 కోట్ల వరకు పందేలపై బెట్టింగ్‌లు నడిచే సూచనలు కనిపిస్తున్నాయి. పందేల వద్ద కొంతమంది ప్రత్యేకంగా వ్యాఖ్యాతలను ఏర్పాటు చేసుకున్నారు.

'రజనీ' స్టైలే వేరు

కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పాములకాల్వ వద్ద ఏటా కోడిపందేలు నిర్వహిస్తారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడు పాములకాల్వ వద్ద 'రజనీ' స్టైల్ చూపిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం నుంచి ఇక్కడ బరుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశాడు. అనుమతుల కోసం ప్రయత్నాలు చేశాడు. కోడిపందేల నిర్వహణ విషయంలో హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు చేతులు ఎత్తేశారు. ఎలాంటి పందేలు నిర్వహించవద్దని అతడిని హెచ్చరించామని పోలీసులు చెబుతున్నారు. అతడిని ఇప్పటికే బైండోవర్ చేశామని అంటున్నారు. అయినా ఈ అధికార పార్టీ నాయకుడు బరులను సిద్ధం చేస్తున్నాడు. కోడిపుంజులకు కత్తులు కట్టకుండా పందేలు నిర్వహిస్తామని తన అనుచరుల వద్ద చెబుతున్నాడు. పైకి ఈవిధంగా చెబుతున్నప్పటికీ కత్తులు కట్టి పందేలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. భోగి రోజు ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ పందేలు కనుమ పండుగ రాత్రి వరకు జరుగుతాయి.



చలి మంటలు.. రేగిపళ్లు.. రంగుల రంగవల్లులు.. ఎగిరే గాలిపటాలు.. ఘుమ ఘుమలాడే పిండి వంటలతో పెద్ద పండక్కి స్వాగతం పలుకుతూ, వెలుగుల ఉత్తరాయణాన్ని ఆహ్వానించే భోగభాగ్యాల భోగిని ఘనంగా జరుపుకొనేందుకు అటు పల్లెలు, ఇటు పట్టణాలు అందంగా ముస్తాబయ్యాయి.

ఓట్ల కష్టాలు

నోట్ల పట్టాలు

ఎన్నికలు సమీపిస్తున్నాయి.. అధికార పార్టీకి ఎదురుగాలి వీస్తోంది.. గెలుస్తామా, లేదా..? అనే మీమాంస.. ఈ సందిగ్ధంలో నయానో భయానో ఓటర్లను ఎలాగైనా మభ్య పెట్టాలని వైసీపీ మచిలీపట్నం నాయకులు భారీ స్కెచ్ వేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పేదలకు ఇళ్ల పట్టాలంటూ ఓ కాగితాన్ని చేతికిస్తున్నారు. ఎలాంటి వివరాలు లేని అనధికార పట్టాలను అందజేయడమే కాకుండా, ఒక్కో పట్టాకు రూ.50 వేలు వసూలు చేస్తుండటం ఇప్పుడు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది.

మచిలీపట్నంలో పేదలకు వైసీపీ అనధికారిక పట్టాలు

- ఎన్నికల ముందు పేదలకు అరచేతిలో వైకుంఠం
- బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌తో సంతకాలు
- ఒక్కో ఇంటి పట్టాకు రూ.50 వేలపైనే వసూలు
- ఆర్‌ఎస్ నెంబరు బదులుగా ఎస్‌ఎఫ్ నెంబరట..!
- ఆన్‌లైన్‌లో కనిపించని వివరాలు
- కలెక్టర్, జేసీకి ప్రతిపక్షాల ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : 'మీరు రహదారుల వెంబడి ఉన్న ఖాళీస్థలంలో నివాసం ఏర్పరచుకుని ఉంటున్నారా. మీ పేరున ఇంటి స్థలానికి పట్టాలు ఇచ్చేస్తాం. మీరు చేయాల్సిందల్లా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి అండగా ఉండండి. ఇంటిపన్ను బకాయిలు ఉంటే వెంటనే చెల్లించేయండి. సంక్రాంతి పండుగ తరువాత మీ పేరున ఇంటి పట్టాలు ఇస్తాం.' అని మచిలీపట్నంలోని పేదలకు అధికార పార్టీ నాయకులు ఆశలు కల్పిస్తున్నారు. పనిలో పనిగా ఇంటి పట్టాలు రావాలంటే రెండు రెవెన్యూ కార్యాలయ అధికారుల చేయి తడపాలని, ఒక్కో పట్టాకు రూ.50 వేల చొప్పున ఇవ్వాలని అధికార పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, పంచాయతీల్లోని సర్పంచ్‌లు వసూళ్లకు దిగుతున్నారు. ప్రజలకు నమ్మకం కలిగించడం కోసం ఈ నెల 11న స్థానిక ఐదో డివిజన్‌లో కొందరికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు.

ఎస్‌ఎఫ్ 361 పేరుతో పట్టాలు

పట్టాలో భూమి వివరాలు అని ఉన్న కాలమ్‌లో సర్వే నెంబరు 361 ఎస్‌ఎఫ్ అని రాస్తున్నారు. ఎస్‌ఎఫ్ పేరుతో సర్వే నెంబర్లు మచిలీపట్నం నియోజకవర్గంలోనే లేకపోవడం గమనించాల్సిన విషయం. ఎవరికైనా పట్టాలు మంజూరు చేసే సమయంలో ఆర్‌ఎస్ నెంబరులో ఎన్ని గజాల్లో స్థలం ఉందో వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం మచిలీపట్నంలో ఇంటి పట్టాలను ఎస్‌ఎఫ్ అనే పేరుతో ఇస్తున్నారు. లే అవుట్ నెంబరు వద్ద ఖాళీగానే ఉంచుతున్నారు. ఇంటి సరిహద్దులు నమోదుచేసే కాలమ్‌లో స్థలం నలుదిక్కుల్లో రెండు వైపులా రహదారులు ఉన్నట్టుగానూ, మరో రెండువైపులా వారికి ఇష్టం వచ్చిన పేర్లు రాసేస్తున్నారు. ఇంటి పట్టా ఇచ్చే ముందు సర్వేయర్లు సర్వే చేసి, భూమికి సంబంధించిన వివరాలు నమోదుచేసి, ఎవరికీ అభ్యంతరం లేదని నిర్ధారించుకోవాలి. ఆ తరువాతే వివరాలను తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లోని రికార్డుల్లో నమోదుచేయాలి. తరువాత ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేసి ఇంటి పట్టాలు ఇవ్వాలి. మండల, డివిజన్ రెవెన్యూ కార్యాలయాల్లో ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండానే ఇంటి పట్టాలను ఇచ్చేస్తుండటం గమనించదగ్గ అంశం.



మచిలీపట్నంలో పేదలకు అందజేస్తున్న ఇంటి పట్టాలు ఇవే



సర్వే నెంబరులో పేర్కొన్న ఎస్‌ఎఫ్ నెంబర్

ఐదో డివిజన్‌లో కొందరికి ఇంటి పట్టాలు ఇచ్చాక.. వాటిలో ఉన్న సర్వే నెంబర్ల వివరాలను ఆన్‌లైన్‌లో ఉన్నాయో లేదో పరిశీలిస్తే ఎస్‌ఎఫ్ 361 నెంబరుతో వివరాలేమీ కనిపించడం లేదు.

స్థలంపై రుణాలు వస్తాయని ఆశచూపి..

రెవెన్యూ అధికారులకు తెలియకుండా, ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో మచిలీపట్నంలో ప్రస్తుతం ఇళ్ల పట్టాల పంపిణీ జరుగుతోంది. నియోజకవర్గంలో 9 వేల మందికిపైగా పట్టాలు ఇస్తామని చెప్పి ఆధార్ కార్డు నెంబర్లు, ఇతరత్రా వివరాలు సేకరించారు. రాజుపేట ప్రాంతంలోని ఆంధ్రా జాతీయ కళాశాల సమీపంలో, మెడికల్ కళాశాలకు సమీపంలో ఉన్న రాడార్ కేంద్ర ప్రాంతం, అంజమ్మ కాలనీలో, జడ్పీ కార్యాలయం సమీపంలో, చిలకలపూడి ఎఫ్‌సీఐ గోడౌన్ల ఎదురుగా, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో, మండలంలోని పలు పంచాయతీల్లో ఈ తరహా ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు జాబితాలను సిద్ధం చేశారు. మచిలీపట్నంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఒక తహసీల్దార్‌తో ఈ ఇంటి పట్టాలపై సంతకాలు చేయిస్తున్నారు. ఇందులో తేదీ, కిందిస్థాయి ఉద్యోగి కౌంటర్ సంతకం కూడా లేవు. ఇలా పంపిణీ చేసిన

- మిగతా 6లో

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు

రైతన్న ఆగ్రహం

సాంకేతిక సమస్యలు పరిష్కరించట్లేదంటూ ఆందోళన



చల్లపల్లి మండలం వక్కలగడ్డలో ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

చల్లపల్లి, జనవరి 13 : ధాన్యం కొనుగోలులో నెలకొన్న తాత్సారం, రైతుల ఇబ్బందులపై అన్నదాతలు ఆగ్రహం చెందారు. రోజుల తరబడి ధాన్యం దిగుమతి కాకపోవటం, సాంకేతిక సమస్యలను పరిష్కరించకపోగా, అమర్యాదకరంగా మాట్లాడుతున్నారంటూ ఆందోళనకు దిగారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డలో శనివారం మధ్యాహ్నం రైతులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన మల్లంపాటి చైతన్యకు చెందిన ట్రాక్టర్‌లో శుక్రవారం సాయంత్రం ఓ రైతు ధాన్యం లోడుతో మాజేరు రైస్‌మిల్లుకు వెళ్లాడు. జీపీఎస్ ట్రాకింగ్‌లో ఫొటో తీయాల్సి ఉండటంతో సర్వర్ పనిచేయలేదు. దీంతో ధాన్యం అన్‌లోడ్ చేసి ట్రాక్టర్‌తో తిరిగి వచ్చేశాడు. శనివారం ఉదయం ట్రాక్టర్‌ను తీసుకురావాల్సిందిగా ఫోన్ చేయటంతో మళ్లీ మాజేరు వెళ్లాడు. ఫొటో తీసుకున్న తర్వాత తిరిగి వచ్చేశాడు. అయినప్పటికీ ధాన్యం అన్‌లోడ్ అయినట్లు ఆర్‌బీకేలో క్లియరెన్స్ రాలేదు. దీంతో ఆ ట్రాక్టర్ ఇంకో లోడుకు వెళ్లేందుకు అవకాశం లేదు. అధికారులకు ఫోన్‌చేయగా, ఆర్‌బీకేలో ప్రచురించిన జీపీఎస్ అండ్ టెక్నికల్ టీం సభ్యుడికి ఫోన్ చేయాలని సూచించారు. అలా ఫోన్ చేసిన సదరు రైతుతో ఆ సభ్యుడు దురుసుగా మాట్లాడాడు. జీపీఎస్ పనిచేయకుంటే ట్రాక్టర్‌ను గోతిలో పడేయాలని అమర్యాదకరంగా మాట్లాడాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుని ఆందోళనకు దిగారు. ధాన్యం లోడును రోడ్డుకు అడ్డంగా పెట్టి ధర్నా చేశారు. ఆఫ్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం తోలిన వెంటనే డబ్బు చెల్లించాలని, రైతులను కించపరిచేలా మాట్లాడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్‌ఐలు సీహెచ్ చిన్నబాబు, కుడిపూడి శ్రీనివాస్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. టెక్నికల్ టీం సభ్యుడితో సీఐ ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నేతలు అట్లూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ రామారావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మల్లుపెద్ది బోసు, హనుమానుల సాయి, వీర్ల మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు. కొద్దిసేపటి తర్వాత ట్రాక్టర్‌కు సంబంధించిన సాంకేతిక సమస్య పరిష్కారమైంది.

ఒక్కొక్కరుగా

గుడ్‌బై



రెండు జిల్లాల్లో వైసీపీని వీడుతున్న కీలక నేతలు

రెండు జిల్లాల్లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి శనివారం పార్టీకి రాజీనామా చేశారు. ఇప్పటికే పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ పార్టీకి గుడ్‌బై చెప్పే వారి జాబితాలో ఉండగా, అనూహ్యంగా వారందరి కంటే ముందు బాలశౌరి పార్టీకి రాజీనామా చేయడం ఆశ్చర్యపరిచింది. వైఎస్సార్ హయాం నుంచి బాలశౌరి ఆ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరొందారు. మొత్తానికి ఒకరి తర్వాత ఒకరు వైసీపీకి గుడ్‌బై చెబుతుండటంతో రెండు జిల్లాల్లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

- అధిష్ఠానం తీరుతో బయటకొస్తున్న ఎమ్మెల్యేలు
- తాజాగా ఎంపీ బాలశౌరి రాజీనామా
- లిస్టులో పార్థసారథి, విష్ణు, రక్షణనిధి కూడా..
- పార్టీ నగర అధ్యక్షుడు భవకుమార్ ఆలోచనా అదే..
- బందరులో కుటిల రాజకీయాలతో బాలశౌరి మనస్తాపం
- కలిసి ప్రయాణం కష్టమంటూ సన్నిహితులతో వ్యాఖ్య

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన బాలశౌరి 2004లో తెనాలి, 2009లో నరసరావుపేట లోక్‌సభ నుంచి ఎంపీగా గెలుపొందారు. 2013, అక్టోబరులో వైసీపీలో చేరారు. 2014లో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2019లో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని అందరు ఎమ్మెల్యేలతో సఖ్యతగా ఉండే బాలశౌరికి స్థానిక ఎమ్మెల్యే పేర్ని నానీతో మాత్రం తొలి నుంచీ పొసగలేదు. మచిలీపట్నంలో

- మిగతా 6లో

పొగబెట్టి.. బుజ్జగింపులు!

- భవకుమార్ ఇంటికి దేవినేని అవినాశ్, బుచ్చిబాబు
- వైసీపీని వీడొద్దని బుజ్జగింపులు
- టీడీపీలోకి రండి..భవకుమార్‌కు వంగవీటి రాధా ఆహ్వానం


భవకుమార్‌తో భేటీ అయిన రాధా

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): 'పార్టీని వీడొద్దు.. కలిసి ప్రయాణం చేద్దాం' అంటూ వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్‌కు ఆ పార్టీ నేతలు దేవినేని అవినాశ్, కడియాల బుచ్చిబాబు విజ్ఞప్తి చేశారు. భవకుమార్ పార్టీని వీడుతున్నారన్న సమాచారంతో వైసీపీ పెద్దలు అప్రమత్తమయ్యారు. శనివారం హడావుడిగా దేవినేని అవినాశ్, బుచ్చిబాబును భవకుమార్ వద్దకు పంపారు. ఆయన్ను బుజ్జగించి పార్టీలో కొనసాగాలే చూసేందుకు అవినాశ్, బుచ్చిబాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నెహ్రూతో కలిసి ప్రయాణం చేసిన తనకు ఆయన కొడుకు అవినాశ్‌తో కలిసి పనిచేయడం ఇబ్బందేమీ కాదని కానీ అవినాశ్ తనను దూరం పెడుతూ వచ్చారని భవకుమార్ వారి వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అవినాశ్ వైసీపీలో చేరకముందు నుంచే తాను పార్టీలో ఉన్నానని, తన సీనియార్టీకైనా గౌరవం ఇవ్వకుండా తనను అవమానాలకు గురి చేశారని, అలాంటి పార్టీలో కొనసాగాలనే ఉద్దేశం తనకు లేదని భవకుమార్ స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో గంటకుపైగా భవకుమార్‌తో భేటీ అయిన అవినాశ్ నిరాశతో వెనుదిరిగారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ వైసీపీలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేశానని, కానీ పార్టీ తనను గుర్తించి పదవిని ఇవ్వాలని ప్రయత్నించిన ప్రతిసారీ అవినాశ్ వర్గం అడ్డుకుందన్న అభిప్రాయంతో భవకుమార్ ఉన్నారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ పదవి దాదాపు ఖరారై జాబితాలో తన పేరు ఉన్నా చివరి నిమిషంలో దాన్ని మార్పించేశారని, డీసీసీబీ ఛైర్మన్‌గా తనకు అవకాశం లభించాల్సి ఉండగా దాన్నీ అడ్డుకున్నారని సన్నిహితులతో వ్యాఖ్యానించారు. తనకు చాలా అవమానాలు జరిగినా ఏనాడూ బయటపడలేదని, ఇకపై మౌనం సరికాదనే పార్టీని వీడాలన్న నిర్ణయానికి భవకుమార్ వచ్చారు.

త్వరలోనే టీడీపీలో చేరుతా..

భవకుమార్‌ను టీడీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, వంగవీటి రాధా శనివారం వేర్వేరుగా కలిశారు. టీడీపీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాధా, భవకుమార్ వైసీపీలో తాము ఎదుర్కొన్న అవమానాలను గుర్తు చేసుకున్నారు. చిత్తశుద్ధితో పనిచేసే వారికి వైసీపీలో సరైన గుర్తింపు ఉండదని భవకుమార్ వ్యాఖ్యానించారు. త్వరలోనే టీడీపీలో చేరతానని ఆయన రాధాకు స్పష్టం చేశారు.



సీఐడీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ పెనమలూరు కార్యకర్తలు

బోడె ప్రసాద్‌కే టికెట్ ఇవ్వాలి

విజయవాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): "పెనమలూరు సీటును మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కే ఇవ్వాలి. ఆయనే మాకు కావాలి. కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వద్ద శనివారం వినిపించిన నినాదాలు ఇవి. ఇసుక సరఫరాలో అవకతవకలు జరిగాయని సీఐడీ నమోదు చేసిన కేసులో వ్యక్తిగత పూచీకతును సమర్పించాలని హైకోర్టు చంద్రబాబును ఆదేశించిన విషయం తెలిసిందే. ఆయన వ్యక్తిగత పూచీకతు సమర్పించడానికి సీఐడీ కార్యాలయానికి వచ్చారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కానూరులోని తులసీనగర్‌కు చేరుకున్నారు. చంద్రబాబు ఎదుట ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలని ఒకసారి నినాదాలు చేస్తే, బోడె ప్రసాద్‌కు పెనమలూరు సీటు ఇవ్వాలని రెండుసార్లు నినాదాలు చేశారు. నినాదాలు చేయొద్దని కొంతమంది ద్వితీయ శ్రేణి నేతలు వారించినా కార్యకర్తలు ఆగలేదు. చంద్రబాబు సీఐడీ కార్యాలయానికి వచ్చినప్పుడు, వెళ్లేటప్పుడు, కార్యాలయంలో ఉన్నప్పుడూ నినాదాలు భారీగా చేశారు. చంద్రబాబు వారికి అభివాదం చేశారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తంగిరాల సౌమ్య

అధికార మదంతో అమానుషంగా ప్రవర్తిస్తున్నారు

- దళిత మహిళనని చూడకుండా అవమానించారు
- చర్యలు తీసుకోండి..వైసీపీ నేతపై తంగిరాల సౌమ్య ఫిర్యాదు

నందిగామ, జనవరి 13: అధికార మదంతో దళిత మహిళనైన తనను అవమానించేలా వీడియోలు ప్రదర్శించిన వైసీపీ నాయకుడు దుబాయ్ కరీముల్లాకు బుద్ధి చెప్పి తీరుతానని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆరో వార్డులో నిర్వహించిన వైసీపీ సభలో తనపై అవమానకరంగా డాక్యుమెంట్ సిద్ధం చేసిన కరీముల్లాపై శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికార మదంతో వైసీపీ నాయకులు తన పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి ప్రవర్తన గల నాయకులు దళిత మహిళను అవమానిస్తుంటే చూస్తూ ఆనందించిన మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌లకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. తనను అవమానించిన వ్యక్తులను పట్టణ వీధుల్లో పరిగెత్తిస్తానని హెచ్చరించారు. సరైన ప్రత్యామ్నాయం లేకుండా రోడ్ల విస్తరణ పనులు చేపట్టి ప్రజలను ఇబ్బంది పడుతుంటే ప్రశ్నించడం పిచ్చి ఎలా అవుతుందని ప్రశ్నించారు. జాతీయ నాయకుల విగ్రహాలతో పాటు తన తండ్రి విగ్రహాన్ని మునిసిపల్ కార్యాలయంలో బాత్‌రూమ్‌ల వద్ద పడవేశారని దానిపై స్పందించడం తప్పా అని ప్రశ్నించారు. మీ ఇళ్లలో ఆడవారి వీడియోలు కూడా ఇలానే తయారు చేసి మేము ప్రదర్శిస్తే మీకు ఆ బాధ తెలుస్తుందన్నారు. మూడు నెలల తరువాత మీ పరిస్థితి ఎలా ఉంటుందో చూసుకోండని హెచ్చరించారు. మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళకు జరిగిన అవమానాన్ని ఆనందించడం హేయమన్నారు. తాను అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తానని ఆమె హెచ్చరించారు.

వైసీపీ ప్రభుత్వం రూ.600 కోట్లు దారి మళ్లించింది

- వెంటనే ఆ నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమచేయాలి
- సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ డిమాండ్

ఉయ్యూరు, జనవరి 13: స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో వైసీపీ ప్రభుత్వం వాడుకునేందుకు చూస్తున్న రూ.600 కోట్లను గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో వెంటనే జమచేయాలని సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ డిమాండ్‌చేశారు. శనివారం స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,918 గ్రామాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-2023 ఆర్థిక సంవత్సరానికి రెండో విడతగా రూ.988 కోట్ల నిధులు విడుదల చేసిందని, అందులో రూ.393 కోట్లు గ్రామ పంచాయతీల పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమచేసి, మిగిలిన రూ.600 కోట్లు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆయన ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు దారి మళ్లింపునకు నిరసనగా సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నామన్నారు. దారిమళ్లించిన నిధులు గ్రామపంచాయతీల ఖాతాల్లో జమచేయకపోతే పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు.

పంచాయతీలకు నిధులు కేటాయించకపోతే పోరాటమే

నాగాయలంక: కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 లో స్థానిక సంస్థలకు విడుదల చేసిన రెండో విడత నిధుల్లో రూ.600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిందని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి మండలి ఉదయభాస్కర్ శనివారం ఆరోపించారు. రూ.600 కోట్లను పంచాయతీలకు జమ చేయకపోతే పోరాటానికి సిద్ధమవుతామని ఉదయభాస్కర్ హెచ్చరించారు.


కొత్తపల్లిలో పామాయిల్‌తోటలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి

బరులు సిద్ధం

అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సంక్రాంతికి కోడి పందేల బరులను సిద్ధం చేశారు. బరుల వద్ద గుండాట, పేకాట వంటి జూదాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

కోడిపందేలతో పాటు గుండాట, పేకాటకు ఏర్పాట్లు ● పట్టించుకోని పోలీసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 13: గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి గ్రామగ్రామాన కోడిపందేలు నిర్వహించేందుకు బరులను అధికార పార్టీకి చెంది స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భారీగా ఏర్పాటు చేస్తున్నారు. బరుల వద్దే పేకాట, గుండాటకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.వందకోట్లకు పైగా చేతులు మారనున్నాయని పందెంరాయుళ్లే చెబుతున్నారు. గతంలో కొత్తపల్లి, మడిచర్ల, ఓగిరాల గ్రామాల్లో కోడిపందేల్లో ఘర్షణలు చెలరేగాయి. కొన్ని రోజుల క్రితమే కొత్తపల్లిలో టీడీపీ-జనసేన బ్యానర్లను ధ్వంసం చేశారు. ఘటనపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. కోడిపందేల మాటున శాంతి భద్రతలకు విఘాతం కలిగితే గ్రామాల్లో గొడవలు జరిగే ప్రమాదం ఉంది.

అంపాపురంలో కేసినోకు ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్రంలోనే పేరుగాంచిన అంపాపురం ప్రధానబరిలో రూ.కోట్లలో పందేలు నిర్వహించేందుకు అన్నిరకాల హంగులతో ఏర్పాట్లు చేశారు. ప్రధాన బరిలో ఒక్కో పందెం రూ.5లక్షలకు పైనే వేయనున్నారు. పక్కన 8బరుల్లో రూ.3లక్షల నుంచి రూ.50 వేల వరకూ పందేలు నిర్వహించనున్నారు. కేసినో కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందర్‌బాహర్‌ను రూ.లక్షల్లో నిర్వహించాలని చూస్తున్నారు. చిన్నకోసు(పేకాట, గుండాట)కు కోసం 15 ఏర్పాటు చేస్తున్నారు. వీటికోసం ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకూ నిర్వాహకులు తీసుకున్నారని సమాచారం. పార్కింగ్, కోసుల ద్వారానే నిర్వాహకులకు పండగ మూడురోజుల్లోనే రూ.4కోట్లకు పైగా రాబడి ఉంటుందని అనుకుంటున్నారు.

జగ్గయ్యపేట ప్రాంతంలో 11కు పైగా..

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రాంతంలో పోలీసుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ పందెం బరులు సిద్ధమయ్యాయి. మండలం, పట్టణ పరిధిలో 11కి పైగా బరులు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా చిన్న, చిన్న బరులు అనేకం ఉన్నాయి. జగ్గయ్యపేట ప్రాంతం తెలంగాణకు సరిహద్దుగా ఉండటంతో సరిహద్దు గ్రామాల్లో బరులకు డిమాండ్ బాగా ఉంది. బూదవాడ, జాతీయ రహదారిపై అనుమంచిపల్లి, తిరుమలగిరి, జగ్గయ్యపేట సమీపంలో సత్యనారాయణపురం, మంగోల్లు, వత్సవాయిల్లో బరులు సిద్ధం చేశారు.

బరులు, పేకాట శిబిరాల వద్ద బౌన్సర్లు

తిరువూరు: నియోజకవర్గంలో భారీగా కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసిన పోలీసుల వద్దకే పందేలు, పేకాల నిర్వాహణకు అనుమతుల కోసం నిర్వాహకులు వెళ్లడం గమనార్హం. గత ఏడాది ఆర్డీవో కార్యాలయం(ఎన్టీఆర్ స్టేడియం)పక్కనేగల మామిడి తోటలో కోడిపందేలు, పేకాట నిర్వహించారు. ఈ ఏడాది ఆ తోటలో పందేల నిర్వాహణకు బరులు సిద్ధం చేసుకుని, స్టాల్స్ నిర్వహణకు అడ్వాన్సులు తీసుకుని స్థలం కేటాయింపులు పూర్తిచేసుకున్నారు. చివరి నిమిషంలో ఆర్డీవో కార్యాలయం సమీపంలోని మామిడి తోటలో పందేల నిర్వాహణకు అనుమతి ఇవ్వరనే సమాచారంతో పట్టణ శివారు అష్టలక్ష్మి ఆలయం సమీపంలోని మామిడి తోటలో బరులు సిద్ధం చేశారు. స్టాల్స్ పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పట్టణంలో రెండు చోట్ల, మండలంలోని కాకర్ల, మల్లేల, ముష్టికుంట్ల గ్రామాల్లో నియోజకవర్గం పరిధిలోని విస్సన్నపేట మండలంలో తాతకుంట్ల, వేమిరెడ్డిపల్లి, కొర్లమండ, తెల్లదేవరపల్లి, పుట్రాల గ్రామాల్లో, ఎ.కొండూరు మండలంలో గోపాపురం, చీమలపాడు, గంపలగూడెం మండలంలో తునికిపాడు, ఊటుకూరు, కొణిజర్ల గ్రామాల్లో కోడిపందేల నిర్వాహణకు ఏర్పాట్లు చేశారు. పట్టణంతో పాటు మండలంలోని కాకర్ల, మల్లేల గ్రామాల్లోని కోడిపందేల శిబిరాల వద్ద పేకాట శిబిరాల నిర్వహణకు పెద్దమొత్తంలో నగదుచేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. దూరప్రాంతానికి చెందిన వారు పందేల వద భారీ పేకాట శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బరులు, పేకాట శిబిరాల వద్ద బౌన్సర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

జూదగాళ్లు, అధికార పార్టీ నేతలు చేతులు కలిపి..

పామర్రు: అధికారుల ఉదాసీన వైఖరితో అడ్డాడ, పామర్రులో జూదగాళ్లు, అధికార పార్టీ చోటా నేతలతో చేతులు కలిపి పందెపు బరులు సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు తమవారేనని అధికార పార్టీకి చెందిన ఓ నేత జూదపురాయుళ్లకు అభయం ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. నిత్యం కలెక్టరు, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులు పయనించే మచిలీపట్నం-విజయవాడ రహదారి సమీపంలోని పామర్రు మార్కెట్ యార్డు ఎదురుగా బరి ఏర్పాటుకు, జూదనిర్వహణకు స్టాల్స్ పేకాట, గుండాట శిబిరాలకు రూ.లక్షల వసూలు చేశారని తెలుస్తోంది.


ఆకునూరు హైస్కూల్‌లో బరి వద్ద టెంట్లు తొలగించిన పోలీసులు

ఆకునూరు హైస్కూల్‌లో బరి

● తొలగించిన పోలీసులు

ఉయ్యూరు: మండలపరిధిలో కోడిపందేలకు బరులను పెద్ద సంఖ్యలో సిద్ధం చేశారు. బొల్లపాడు, ఆకునూరు, పెద ఓగిరాలలో పందేలు వేసేందుకు లైటింగ్‌తో పాటు పందెంరాయుళ్ల కోసం ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఆకునూరు ప్రభుత్వ పాఠశాల(హైస్కూల్) ఆవరణలో పెద్ద సంఖ్యలో పందేలు వేసేందుకు శనివారం ఉదయానికే టెంట్లువేసి బరులు సిద్ధం చేయగా కంకిపాడు సీఐ శ్రీనివాస్, ఉయ్యూరు రూరల్ ఎస్సై అవినాశ్ సిబ్బందితో వెళ్లి టెంట్లు తొలగించారు. మూర్తిరాజు పాలెం రోడ్డులోని ఓ ప్రైవేట్ వెంచర్‌లోకి మార్చారు. పెదఓగిరాల, ఆకునూరు ప్రైవేట్ వెంచర్, బొల్లపాడు చింతల తోటలో బరుల వద్ద ఇప్పటికే చాటుమాటుగా పందేలు ప్రారంభించారు.


ఉయ్యూరు మండలం బొల్లపాడులో సిద్ధం చేసిన బరి



పామర్రు, తిరువూరులో బరులు




కంకిపాడు మండలం ఉప్పలూరు, కె.సీతారాంపురంలో జాతీయ రహదారి పక్కన, ఉయ్యూరు మండలం పెద ఓగిరాలలో సిద్ధమైన బరులు

వైభవంగా జోసఫ్ తంబి తిరునాళ్ల ప్రారంభం

ఉంగుటూరు, జనవరి 13: పెదఅవుటపల్లిలోని కథోలిక పుణ్యక్షేత్రంలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు(తిరునాళ్ల)శనివారం ఉదయం 7గంటలకు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు నిర్వహించే వేడుకలను మేరీమాత కపూచియన్, ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా ప్రొవిన్షియల్ రెవరెండ్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు, ఇతర గురువులు కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత తంబి సమాధివద్ద మరియదాసు ప్రత్యేక ప్రార్థనలు చేశాక, తంబి కళావేదిక వద్ద దివ్యపూజాబలిని సమర్పించారు. ఉదయం పదిన్నరకు రెవరెండ్ ఫాదర్ చాపిరేవుల ఏసుపాదం, మధ్యాహ్నం రెండున్నరకు రెవరెండ్ ఫాదర్ కాటా బాలజోజప్ప దివ్యపూజలను సమర్పించారు. సాయంత్రం 5గంటలకు కపూచియన్ నూతన గురువులు, జూబిలేరియన్స్ సమిష్టి దివ్యబలిపూజను సమర్పించారు.


జ్యోతి ప్రజ్వలనచేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న గురువులు

శరవేగంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 13: స్వరాజ్య మైదానంలో 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 19న నిర్వహిస్తున్నందున కార్యక్రమ ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వివరించారు. శనివారం విగ్రహావిష్కరణ ఏర్పాట్లను జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి ఏలూరు, పల్నాడు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 80 వేల మందికి పైగా తరలిరానున్నారని కలెక్టర్ తెలిపారు. వాహనాలకు జిల్లాల వారీగా ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి అంబేడ్కర్ స్మృతివనం వరకు మహాత్మాగాంధీ రహదారిపై బారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నామని, వివరాలను ప్రజలకు తెలియజేసేలా ఎల్ఈడీ స్క్రీన్లను నగరంలోని ప్రధాన కూడళ్లు, ఎంజీ రోడ్డులో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి వచ్చే వారి కోసం మధ్యాహ్నం భోజనం, స్నాక్స్, రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఓట్ల కష్టాలు..నోట్ల పట్టాలు

(ఐదో పేజీ తరువాయి)

భూముల్లో ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఓ సహకార బ్యాంకులో రుణాలు కూడా మంజూరవుతాయని కార్పొరేటర్లు చెప్పడం గమనించదగ్గ అంశం. తామే రుణం ఇప్పిస్తామని అధికార పార్టీ నాయకులు హామీ ఇస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి పీఏ రెవెన్యూ విభాగంలో ఉద్యోగి కావడంతో ఆయన కనుసన్నల్లో వీఆర్వోలను విడతలవారీగా పిలిచి, కార్పొరేటర్లు, కీలక నాయకులు చెప్పినట్టుగా ఇంటి పట్టాలు తయారు చేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో కొందరు వీఆర్వోలు ఎన్నికల సమయంలో తమకెందుకు ఈ తలనొప్పి అని లోలోపలే మదనపడిపోతున్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో ఇంటి పట్టాలపై సంతకాలు దాదాపు పూర్తవుతాయని, ఆ తరువాత పట్టాల పంపిణీ జరుగుతుందని అధికార పార్టీ నాయకులు బాహాటంగానే చెబుతున్నారు.

కలెక్టర్, జేసీకి ఫిర్యాదు

ఈ అంశంపై ప్రతిపక్ష నాయకులు అన్ని ఆధారాలతో కలెక్టర్, జేసీకి ఇటీవల ఫిర్యాదు చేశారు. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని వారు తహసీల్దార్‌ను ఆదేశించారు.


క్రీడాకారులకు షీల్డులు అందిస్తున్న సంపూర్ణేష్‌బాబు

విజయావకాశాలు అందిపుచ్చుకోవాలి

- సినీ నటుడు సంపూర్ణేష్ బాబు

కూచిపూడి, జనవరి 13: కృషి, పట్టుదలతో విజయావకాశాలను అందిపుచ్చుకోవాలని క్రీడాకారులకు సినీ నటుడు సంపూర్ణేష్ బాబు పిలుపునిచ్చారు. గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కూచిపూడిలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవంలో సంపూర్ణేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు మెమెంటోలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. సాయి ఫౌండేషన్ ఛైర్మన్ గొట్టిపాటి సాయి, పామర్రు సీఐ వి.శుభాకర్, ఎస్ఐ డి.సందీప్ పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్థుడు సీఎం జగన్‌రెడ్డి: కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, జనవరి 13: "సీఎం జగన్‌రెడ్డిపై 38 కేసులున్నాయి. రూ.43 వేల కోట్లు దోపిడీ చేసినట్లు సీబీఐ, ఈడీ చార్జిషీట్లు వేశాయి. ఈ కేసులకు ఆయన 3500 వాయిదాలు తీసుకున్నారు. శిక్ష పడుతుందనే భయంతోనే కోర్టుకు జగన్ హాజరవడం లేదు. 2004లో రూ 1.73 కోట్ల ఆస్తి మాత్రమే ఉన్న జగన్‌రెడ్డికి 19 ఏళ్లలో రూ.4 లక్షల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి? 16 లిస్టెడ్ కంపెనీలు, 50 సూట్ కేసుల కంపెనీలు, వేలాది ఎకరాల భూములు, 5 నగరాల్లో అదిరిపోయే ప్యాలెస్‌లు ఎలా వచ్చాయి? జగన్‌రెడ్డిని రూ.43 వేల కోట్లు ఎలా సంపాదించారని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అల్తాబ్ ఆలం ప్రశ్నించారు. ఆర్థిక నేరస్థుడైన జగన్‌రెడ్డికి యావజ్జీవ కారాగార శిక్ష తప్పదు." అని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన కేసుల్లో ఆర్థికంగా ప్రయోజనం పొందినట్లు కోర్టుకు సీబీఐ ఆధారాలు చూపలేకపోయిందన్నారు. చార్జిషీట్ వేయలేకపోయిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం

ఉంగుటూరు, జనవరి 13: చెన్నై-కోల్‌కతా 16వనెంబర్ జాతీయరహదారిపై పొట్టిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిచెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం పసర్లపూడికి చెందిన శ్రీరామరెడ్డి సత్యనాగసాయి(26), అదే జిల్లా రామచంద్రపురానికి చెందిన బొబ్బా చాందిని(25) హైదరాబాద్‌లో వేర్వేరు కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఇద్దరు బుల్లెట్‌పై శుక్రవారం రాత్రి 11గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరారు. తలకు హెల్మెట్లు ధరించారు. శనివారం ఉదయం విజయవాడ దాటాక చాందినికి చెవి నొప్పిగా వుండటంతో హెల్మెట్ తీసి బండికి తగిలించింది. పొట్టిపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగిన తర్వాత మంచు కారణంగా దారి సరిగా కనబడకపోవడంతో రోడ్డు పక్కన ఆగి ఉన్న భారీ కంటైనర్‌ను బుల్లెట్ వెనుక నుంచి ఢీకొట్టింది. బైక్ వెనుక కూర్చున్న చాందిని ఎగిరి రోడ్డుపై పడి, తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సత్యనాగసాయికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు చాందిని మృతదేహాన్ని పోస్టుమార్టానికి గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒక్కొక్కరుగా గుడ్‌బై

(ఐదో పేజీ తరువాయి)

తమదే ఆధిపత్యం అనే రీతిలో పేర్ని నాని, ఆయన కొడుకు కిట్టూ వ్యవహరిస్తుండటంతో ఎంపీకి అధికారుల నుంచీ సహాయ నిరాకరణ ఎదురవుతూ వచ్చింది. కనీసం ప్రొటోకాల్ పాటించకుండా తనను అవమానిస్తున్నారని సాక్షాత్తూ ఎంపీనే బహిరంగంగా పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో పేర్ని నాని ఆధ్వర్యంలో జరిగిన ప్రధానమైన అభివృద్ధి కార్యక్రమాలకు కానీ, పార్టీ కార్యక్రమాలకు కానీ బాలశౌరిని ఆహ్వానించలేదు. మచిలీపట్నం నియోజకవర్గంలో తమకు ఇష్టం లేకుండా, సంప్రదించకుండా ఏదైనా అభివృద్ధి చేస్తే పేర్ని నాని సహించలేకపోయేవారు. తాను, తన కొడుకు తప్ప మరొకరికి పేరు రావడాన్ని ఆయన అంగీకరించేవారు కాదు. ఈ ధోరణితో ఎంపీతో ఆయనకు దూరం పెరుగుతూ వచ్చింది.

అడుగడుగునా అవమానాలే..

- మచిలీపట్నం నియోజకవర్గంలోని ఇనుగుదురుపేట జామియా మసీదు ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల కోసం వైసీపీ మైనారిటీ నాయకులు ఎంపీ బాలశౌరిని కోరారు. వారి అభ్యర్థన మేరకు ఎంపీ రూ.25 లక్షలు తన ఎంపీ నిధుల నుంచి మంజూరు చేయించారు. ఈ మేరకు 2022, డిసెంబరు 2న జిల్లా కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. ఎంపీ నుంచి నిధులు తెచ్చుకున్నారన్న కారణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మచిలీపట్నం కార్పొరేషన్ నుంచి అనుమతులు రాకుండా చేశారు పేర్ని నాని. అనుమతులు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని ముస్లిం మత పెద్దలు హెచ్చరించడంతో చివరికి దిగివచ్చి అనుమతులు మంజూరు చేయించారు.
- ఉమ్మడి కృష్ణాజిల్లావాసుల సుదీర్ఘ కల అయిన మచిలీపట్నం పోర్టును సుమారు రూ.12 వేల కోట్లతో అభివృద్ధి చేయడానికి టీడీపీ హయాంలోనే రూట్‌మ్యాప్ రెడీ అయింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే పేర్ని నాని పోర్టు నిర్మాణ పనులను ప్రభుత్వమే చేపట్టి పరుగులు తీయిస్తుందని ప్రకటించారు. ఐదేళ్ల కాలంలో మూడేళ్లపాటు పేర్ని నాని మంత్రిగా అధికారం చెలాయించారు. కానీ, బందరు పోర్టు పనులు మాత్రం అడుగు ముందుకు పడలేదు. ఎంపీ బాలశౌరి పోర్టు నిర్మాణం కోసం చొరవ తీసుకున్నా ఆయనకు పేరు రాకూడదన్న ఉద్దేశంతో నాని వాటిని అడ్డుకుంటూ వచ్చారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కొద్దిరోజుల క్రితం పోర్టు నిర్మాణం జరుగుతుందంటూ హడావుడి మొదలుపెట్టారు.
- ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మచిలీపట్నం ఖ్యాతిని దశదిశలా చాటిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో స్మారక భవనం నిర్మించాలన్న ఆలోచనకు ఎంపీ బాలశౌరి ఊపిరిపోశారు. స్మారక భవనంతో పాటు మ్యూజియం, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఆంధ్రాబ్యాంకును విలీనం చేసుకున్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉన్నతస్థాయి అధికారులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి రూ.70 కోట్లను మంజూరు చేయించారు. ఈ నిర్మాణ పనులకు మచిలీపట్నంలో 2 ఎకరాలు కేటాయించాలని ఎంపీ.. అధికారులను పదేపదే కోరుతూ వచ్చారు. కానీ, భూకేటాయింపులు జరగకుండా పేర్ని నాని అడ్డుచక్రం వేయడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. మరోవైపు స్మారక భవనానికి కేటాయించాలని కోరిన స్థలాన్ని వైసీపీ జిల్లా కార్యాలయానికి కేటాయింపజేసుకున్నారు. అక్కడ వైసీపీ జిల్లా కార్యాలయం ఆగమేఘాలపై పూర్తయింది. యువతకు ఉపాధి కల్పించాల్సిన స్కిల్ సెంటర్ మాత్రం జాడ లేకుండాపోయింది.
- మచిలీపట్నం కార్పొరేషన్ 33వ డివిజన్ కార్పొరేటర్ అస్గర్ అలీని పేర్ని నాని రెచ్చగొట్టి ఎంపీ బాలశౌరిని బూతులు తిట్టించారు. 2022, జూన్ 10న జరిగిన ఈ ఘటన పేర్ని నాని, ఎంపీ బాలశౌరికి నడుమ శాశ్వతంగా దూరం పెంచేసింది. అస్గర్.. పేర్ని నానీకి ముఖ్య అనుచరుడు. ఆయన గీసిన గీత దాటడన్న పేరుంది. ఈ వివాదంలో వైసీపీ పెద్దలు సరైన రీతిలో వ్యవహరించలేదని బాలశౌరి మనస్థాపం చెందారు.

త్వరలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు అవుట్

వైసీపీ నుంచి త్వరలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా బయటకు వస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరిలో ఒకరు తెలంగాణ సరిహద్దులో ఉన్న నియోజకవర్గానికి చెందినవారు కాగా, మరొకరు విజయవాడ చెంతనే ఉన్న నియోజకవర్గానికి చెందినవారు. ప్రభుత్వం నుంచి వీరిద్దరికీ నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ కారణంగా ఇద్దరూ ఓపిగ్గా వేచిచూసే ధోరణిలో ఉన్నారు. నిధుల విడుదలపై స్పష్టత వచ్చిన మరుక్షణం వీరిద్దరూ పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఒకరు జనసేనలో.. మరొకరు టీడీపీలో చేరుతారని సమాచారం.

కృష్ణా
●పెనమలూరు ● గన్నవరం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

దేవస్థానం భూముల్లో రోడ్ల తొలగింపు



విజయవాడ రూరల్, జనవరి 13 : నున్న రామలింగేశ్వర స్వామి దేవస్థానం భూముల్లో వేసిన అనధికారిక రోడ్డును దేవ స్థానం ఈవో అరుణ శనివారం తొలగించారు. గ్రామంలో గ్యాస్ గౌడౌన్ సమీపంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఎనిమిది ఎకరాల భూమి ఉంది. సమీపంలో ప్రైవేట్ వెంచర్ వేస్తున్న వ్యక్తులు రెండు రోజుల క్రితం దేవస్థానం భూముల్లో కూడా వెంచర్‌లో కలుపుతూ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఆలయ ఈవో సిబ్బంది సహాయంతో జేసీబీల సహాయంతో రోడ్డును తొలగించారు.

జంక్షన్ క్రీడాకారులకు పతకాలు

హనుమాన్‌జంక్షన్, జనవరి 13 : జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ క్రీడలో టైగర్ పవర్‌క్లబ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో హనుమాన్ జంక్షన్‌కు పేరు తేవడం అభినందనీయమని స్థానిక పలువురు వక్తలు పేర్కొన్నారు. జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక టైగర్ పవర్‌క్లబ్‌కు చెందిన విద్యార్థులు 11 పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఐసీఎం పాఠశాలలో క్లబ్ కోచ్ కట్టా సుధాకర్ నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు.

ఆర్థిక నేరస్థుడు జగన్

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 13 : దేశంలోనే అతిపెద్ద ఆర్థిక నేరస్థుడు జగన్‌రెడ్డికి జన్మజన్మకు యావజ్జీవ శిక్ష తప్పదని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ జేబు సంస్థ సీఐడీని అడ్డుపెట్టుకొని ప్రజల దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం, నీలి మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో బోడె ప్రసాద్ పార్టీ శ్రేణులతో పాల్గొని అధికార పార్టీ దుర్మార్గాలను ఎండగట్టారు. తీవ్ర నేరారోపణలకు సంబంధించిన 338 కేసుల్లో 43వేల కోట్ల దోపిడీపై సీబీఐ ఈడీకూడా ఛార్జిషీట్లు వేసిన విషయాలను గుర్తు చేశారు. కేసులకు సంబంధించి 3500 వాయిదాలను తీసుకోవడం దారుణమైన విషయమని వ్యాఖ్యానించారు. శిక్ష పడుతుందనే విషయం నిర్ధారణతోనే కోర్టులకు హాజరు కాకుండా వాయిదాలు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎటు వంటి ఆర్థిక ప్రయోజనం పొందలేదని, దీనికి సంబంధించిన ఒక్క ఆధారాన్ని సీఐడీ చూపలేకపోయిందని విమర్శించారు. 16 నెలలు జైలులో ఉండి కుటుంబ ఆస్తులు జప్తు చేయడం ప్రజలు ఇంకా మర్చిపోలేదని వ్యాఖ్యానించారు. తీవ్రమైన ఆర్థిక నేరాల్లో బెయిల్ ఇచ్చే సమయంలో కోర్టు ఆరోపణల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొనడాన్ని బట్టి జగన్ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చని బోడె పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, కుర్రా నరేంద్ర, తోటకూర ఉదయభాస్కర్, ముసునూరు శ్రీనివాసరావు, శ్రీధర్, బోడె సురేంద్ర, తుమ్మల రాంకుమార్, షేక్ షకీలా, మల్లంపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో మండలి దీక్షలు

గన్నవరం, జనవరి 13 : పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శ్రీలలిత సహస్ర నామ మండలి దీక్ష పారాయణం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి 23న జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని మండలి దీక్షను చేపట్టారు. తొలుత కాసన్నేని బాబూరావు, బేబి సరోజిని దంపతులచే కలశ స్థాపన ద్వారా మండల దీక్షకు శ్రీకారం చుట్టారు. శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ మాతృమండలి సభ్యులచే శ్రీలలిత సహస్రనామ పారాయణం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు.

గోదాదేవికి పట్టు వస్త్రాల సమర్పణ

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించనున్న గోదాదేవి రంగనాధుల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని దేవతామూర్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు శనివారం పట్టువస్త్రాలు అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత కార్యక్రమాల్లో భాగంగా గోదాదేవి రంగనాధుల కల్యాణం మహోత్సవం వేడుకగా నిర్వహిస్తున్నారు.

చంద్రబాబుతోనే ముస్లింల అభ్యున్నతి

టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, షేక్ బుజ్జి



కానూరులో జరిగిన కార్యక్రమంలో వెలగపూడి, షేక్ బుజ్జి

పెనమలూరు, జనవరి 13 : చంద్రబాబు ప్రభుత్వంలోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతి జరిగిందని టీడీపీ నాయకులు వెలగపూడి శంకరబాబు, షేక్ బుజ్జి పేర్కొన్నారు. శనివారం కానూరు సనత్‌నగర్‌లో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో అమలు చేసిన అనేక ముస్లిం పథకాలను సైకో జగన్‌రెడ్డి రద్దు చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంజాన్ తోఫా, ముస్లింలకు విదేశీ విద్య, షాదీ తోఫా లాంటి ప్రతిష్ఠాత్మక పథకాలను రద్దు చేయడం సిగ్గు పడాల్సిన విషయమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును తిరిగి ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వారి వెంట ఇమాం, రఫీ, రెహమాన్, ఇక్బాల్, బచ్చన్, అబిద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు తీరిక లేకపోవటం సిగ్గుచేటు

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి



అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న దండమూడి చౌదరి



గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా..

కంకిపాడు, జనవరి 13 : అంగన్వాడీలు 32 రోజులుగా దీక్షలు చేస్తుంటే పరిష్కరించాల్సిన సీఎంకు తీరికలేకపోవటం సిగ్గుచేటని, అంగన్వాడీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక దీక్షకు ఆయన శనివారం సంఘీభావం తెలిపారు. అనంతరం అంగ న్వాడీలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దండమూడి చౌదరి మాట్లాడుతూ, అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తుంటే సంబంధం లేని మంత్రులతో చర్చలు జరుపుతున్నారే తప్ప సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, బొర్రా వెంకట్, సీఐటీయూ నాయకులు తాడంకి నరేష్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కంకిపాడు క్లస్టర్ అధ్యక్షుడు వై. నళిని, భవాని తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీలు సమ్మె విరమించేంత వరకు ప్రతి మూడు రోజులకోసారి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

గన్నవరం : జగనన్న నీకు అంత కోపమా.. అంగన్వాడీల మీద జాలి చూపుమా.. మా కష్టం ఏమైన గుర్తించలేదుగా.. ఏమైన జాలి నీకు లేదుగా అంటూ పాటలు పాడుతూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న ధర్నా శనివారానికి 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్‌రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. రజని, రమాదేవి, లక్ష్మీ, శాంత, అనిత, భానుమతి, కనకదుర్గ, కోటేశ్వరమ్మ, సాంబ పాల్గొన్నారు.

కానూరులో సంక్రాంతి సంబరాలు



కానూరు కేసీపీ కాలనీలో జరిగిన సంబరాల్లో సుచిత్ర

పెనమలూరు, జనవరి 13 : కానూరు కేసీపీ కాలనీలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ వేషధారణలో స్థానికులు సంబరాల్లో పాల్గొన్నారు. గంగిరెద్దుల, హరిదాసుల కోలాహలాల మధ్య సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కాలనీకి చెందిన స్థానికులు కార్యక్రమంలో పాల్గొని అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని యార్లగడ్డ రూప్‌కుమార్ పర్యవేక్షించారు.

పిన్నమనేని టీచర్స్ కాలనీలో..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా విజయవాడ పిన్నమనేని టీచర్స్ కాలనీలో ముగ్గుల పోటీలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జడ్జిగా వ్యవహరించిన యలమంచిలి సరోజినీ దేవి, తొట్టెంపూడి వాణి, వేములపల్లి సురేష్(చిన్ని)లు మాట్లాడుతూ, మొదటిసారి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పొట్లూరి వెంకట్‌రావు, అట్లూరి చంద్రశేఖర్, యలమంచిలి రవి, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 13 : జాతీయ రహదారిపై రోడ్డు దాటేందుకు నిలబడిన మహిళను లారీ ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం వీరవల్లి బైపాస్‌ను దాటేందుకు అదే గ్రామానికి చెందిన బెజవాడ మరియమ్మ(45) రోడ్డు పక్కన వేచి ఉందని, ఏలూరు నుంచి విజయవాడ వైపునకు వెలుతున్న లారీ అతివేగంగా ఢీకొనడంతో జాతీయ రహదారికి ఏర్పాటు చేసిన సైడ్‌వాల్‌కు తగిలి కింద పడిపోగా లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందిందని వివరించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని అందరికీ వివాహాలయ్యాయని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి లారీడ్రైవర్ నిర్లక్ష్యంతో కూడిన అతివేగమే కారణమని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై చిరంజీవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త రంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన

గన్నవరం, జనవరి 13 : రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గన్నవరం ట్రాఫిక్ ఎస్సై దుర్గారావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ జె.వందన, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రశాంతి, యువకేంద్రం ఆఫీసర్ రాము పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 13 : విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులకు ఈ క్రాప్ నమోదు ద్వారా మాత్రమే ప్రభుత్వ పరిహారం, రాయితీలు అందిస్తున్నారని కాబట్టి రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో జె.భవాని సూచించారు. పెరికీడులో సాగుచేసిన అపరాల పంటను శనివారం పరిశీలించారు.

దరఖాస్తు చేసుకోండి

ఉయ్యూరు, జనవరి 13 : ఉయ్యూరు వేణుగోపాలస్వామి దేవస్థానంకు నూతన ధర్మకర్తల మండలి నియామకానికి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఆలయ ఏవో సురేశ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తికల వారు 20 రోజుల లోపు దరఖాస్తులు మచిలీపట్నంలోని జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ఉయ్యూరు, జనవరి 13 : లయన్స్‌క్లబ్ ఇంట ర్నేషనల్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి పురస్కరించుకుని ఉయ్యూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీవితంలో సేవ ఒక భాగం కావాలన్నారు. జోన్స్ ఆశయాల కనుగుణంగా జిల్లా పెద్దల సూచనలతో ఉయ్యూరు ప్రాంతంలో లయన్స్‌క్లబ్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. క్లబ్ ట్రెజరర్ పూర వకిషోర్, ప్రతినిధులు పొగిరి రాము, నెల్లి రాంబాబు, దినవహిప్రసాద్, అబ్దుల్ హసన్ పాల్గొని సేవలందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

రైతులు కన్నెర్ర చేస్తే వైసీపీ అడ్రస్ గల్లంతు: గోపు

మచిలీపట్నం టౌన్, జనవరి 13 : వైసీపీ పాలనలో రైతులకు సంక్రాంతి పండుగ లేకుండా పోయిందని, రైతులు కన్నెర్ర చేస్తే వైసీపీ ప్రభుత్వం అడ్రస్ లేకుండా పోతుందని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్య నారాయణ ధ్వజమెత్తారు. మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయం వద్ద శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, సంక్రాంతి అంటేనే రైతులు ఆనందంగా జరుపుకునే పండుగ అని, ధాన్యానికి గిట్టుబాటు ధరలేక, సకాలంలో ప్రభుత్వం నగదు చెల్లించక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు .సమావేశంలో వేముల శివాజీ, పామర్తి లక్ష్మణ్, ఆళ్ల మాధవ, బడే రమణ, గోవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రద్దీ

అవనిగడ్డ రూరల్, జనవరి 13 : సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలతో పులిగడ్డ టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. గుంటూరు జిల్లా వైపు నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు రావటంతో కొద్దిసేపు వాహనాలు బారులు తీరాయి. దివిసీమ వాసులు పులిగడ్డ టోల్ ప్లాజా గుండా ఇతర ప్రాంతాలకు చేరుకున్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పులిగడ్డ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విఖనస ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. చల్లపల్లి రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు, భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

టీడీపీ పెడన ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్

పెడన రూరల్ : టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ పెడన ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు మండలం శారదాయిపేటలో మండలస్థాయి బీసీ జయహో కార్యక్రమం నిర్వహించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ బీసీలకు పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారి అభ్యు న్నతికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు(బుల్లయ్య) మాట్లాడుతూ, వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, జనరంజకమైన పాలనకోసం ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, పోతన స్వామి, పరసా సూర్యనారాయణ, కాసగాని శ్రీనివాసరావు, మునేశ్వరరావు, గోపి నాగబాబు, చింతలమ్మ, వాకా శ్రీనివాసరావు, బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కాగిత కృష్ణప్రసాద్

నాగాయలంక : కమ్మనమోలులో శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాలని భావదేవరపల్లి సర్పంచ్, టీడీపీ నేత మండలి ఉదయభాస్కర్ ప్రజలను కోరారు. ఇంటింటికి తిరిగి గ్రామస్థులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కూరాకుల నాంచారయ్య, నాగులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే జనసేనలోకి: మాదివాడ

అవనిగడ్డ, జనవరి 13 : ప్రజలకు మెరుగైన సేవలందిం చేందుకు జనసేన పార్టీలో చేరినట్లు శ్రీవివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాదివాడ వెంకట కృష్ణ (బ్రదర్ క్రిస్టియన్) తెలిపారు. ఇటీవల జనసేనలో చేరిన మాదివాడ వెంకటకృష్ణ శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా యువజన సంఘం ఆధ్వర్యంలో కక్షలు కార్పణాలు కలిగిన దివి ప్రాం తంలో మార్పు తీసు కొచ్చేందుకు ప్రయత్నించి సఫలమయ్యామన్నారు. రాజకీ యాల్లో కూడా ఓ మంచి మార్పు తీసుకు రావాలన్న పవన్ కల్యాణ్ ఆశయా లు నచ్చి ఆ పార్టీలో చేరినట్లు వెంకట కృష్ణ తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యున్నతి కోసం, ప్రజలకు అన్ని రకాల వసతులు సమకూర్చేందుకు రాబోయే రోజుల్లో పనిచేస్తానని ఆయన తెలిపారు.



మాదివాడ వెంకట కృష్ణ

బంటుమిల్లిలో బరులు ధ్వంసం

బంటుమిల్లి, జనవరి 13 : మండలంలో పలు చోట్ల కోడిపందాల బరులు ఏర్పాటు చేస్తుంటే బంటుమిల్లి పోలీసులు బరులు తొలగిస్తున్నారు. మండలంలో బంటుమిల్లి, పెందుర్రు, అర్తమూరు, ముల్లపర్రు, తదితర గ్రామాలలో బరులు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని గ్రామాలలో ఏర్పాటు చేసిన బరులను అనుమతులు లేవంటూ పోలీసులు తొలగిస్తున్నారు. పండగ ముందు పోలీసులు హడావిడి చేసి పోలీసులు పత్తా ఉండరనేది పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తలశిల శ్రీనివాస్ మృతి తీరనిలోటు



శ్రీనివాస్ సంతాప సభలో ప్రసంగిస్తున్న సురేంద్రనాథ్ బెనర్జీ

చల్లపల్లి, జనవరి 13 : ఆక్వా రంగ ప్రముఖులు తలశిల శ్రీనివాస్ మృతి ఆక్వా రంగానికి తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. తలశిల శ్రీనివాస్ సంస్మరణ సభ చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలు, రాజకీయవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, సబ్బినేని బుచ్చిరామయ్య, మద్దిపట్ల జగన్మోహనరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, కోనేరు బలరాం, యద్దనపూడి మధు, పాలడుగు రత్నబాబు పాల్గొన్నారు.

గోశాల ట్రస్టుకు నీలకంఠ గోవు

కపిళేశ్వరపురం(పమిడిముక్కల), జనవరి 13 : కపిళేశ్వరపురంలో సీకేఆర్ ఏకాత్మ గోశాల ట్రస్టు ద్వారా రాజమహేంద్రవరంలో రోటరీ ఇస్కాన్ నిర్మించిన మహాకాళేశ్వర్ ఆలయానికి గిరి జాతికి చెందిన రూ. 10లక్షలు విలువచేసే వృషభరాజాన్ని సీనియర్ న్యాయవాది చిగు లూరి కృష్ణారావు శనివారం ఆలయ చైర్మన్ పీ వెంకట్రావుకు అందజేశారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి తుమ్మల వెంకట గంగాధరరావు, అధ్యక్షుడు కడియాల ప్రకాశం, చిగురుపాటి జగదీశ్, తుమ్మల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పామర్రు, జనవరి13 : నాగులేరు కట్ట వెంట ఉన్న యాదవుల కాలనీతోపాటు, కొండిపర్రులో పేకాట రాయుళ్లు ఏడుగురుని శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,750 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



యలమర్రులో టీడీపీలో చేరిన పలు కుటుంబాలు

పెదపారుపూడి, జనవరి 13 : స్వర్ణాంధ్రప్రదేశ్ కావాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉంటేనే సాధ్యమవుతుందని నియోజకవర్గ ఇంచార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. యలమర్రులో టీడీపీ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ల కుమార్ రాజా రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త పని చేయాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు టీడీపీలో చేరారు. సూరపనేని వెంకట సత్యనారా యణ, చలసాని రమేష్ చౌదరి, మసిముక్కు రాంబాబు, తుమ్మపూడి దాసు, తుమ్మపూడి సుధాకర్, తుమ్మపూడి సునీల్, కడిమి సుబ్రహ్మణ్యం, బంద్రపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

మోపిదేవి, జనవరి 13 : కొక్కిలిగడ్డ వద్ద కృష్ణానది కరకట్టపై ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మాణ పనులకు జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. టీడీపీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ నిధులు రూ.5 లక్షల కేటాయించారు. కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, దిడ్ల రాణి దంపతులు ప్రత్యేక పూజా కారక్రమాలు నిర్వహించారు. బొబ్బర్లంక, కె.కొత్తపాలెం సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు పాల్గొన్నారు.

వీకేఆర్ అండ్ వీఎన్‌బీలో సంబరాలు



గుడివాడ : వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గంగిరెద్దులు, భోగి మంటలు, భోగి పళ్ల పోయించుకున్న పిల్లలు, చెరకు గడలు, పాలపొంగుళ్లు చేశారు. బొమ్మలకొలువు, సిరి మువ్వలతో ప్రతిధ్వనించే గంటల సవ్వడి, హరిదాసుల వస్త్రధారణలో విద్యార్థుల సందడి, గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ గొబ్బిపాటలు పాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి. ప్రసాదరావు, కల్చరల్ క్లబ్ ఇన్‌చార్జిలు ముత్యాలు, ధనుంజయ, నరేంద్ర పాల్గొన్నారు.


సంక్రాంతి కానుకలు పంపిణీ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న నాగరాము

మచిలీపట్నం టౌన్, జనవరి 13 : చంద్రబాబు పాలనలో పండుగ సందర్భాలలో పేదలకు సంక్రాంతి తోఫాలు పంపిణీ చేసేవారని టీడీపీ కార్పొరేటర్, టీడీపీ శిష్ట బలిజ సాధికారత రాష్ట్ర కన్వీనర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా 27వ డివిజన్‌లో 150 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు మాగంటి శిరీష, గడ్డం శివ, అహమ్మద్ జానీ, అహ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సంతకాల సేకరణ



బంటుమిల్లి, జనవరి 13 : అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెలో భాగంగా జగన్నకు చెబుదాం అంటూ సంతకాల సేకరణతో నిరసనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు



గుడివాడలో సంక్రాంతి సంబరాలు, బందరులో పిల్లలకు భోగిపళ్లు పోస్తున్న కొల్లు నీలిమ, బండి రామకృష్ణ

గుడివాడ : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంతోషం-సగంబలం పేరుతో వినూత్నంగా నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామాల్లో మహిళలకు, పురుషులకు, పిల్లలకు ఉత్సాహం కలిగించే వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. నిత్యావసర వస్తువులను బహుమతులుగా అందజేశారు. **నందివాడ :** వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న త్రోబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. శంకరంపాడు సర్పంచ్ సుబ్బారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్ : గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువులు, మహిళల రంగవల్లుల పోటీలు, పిల్లలకు బోగిపళ్లు, చెరకు గడలతో అలంకరణలతో జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. విజేతలకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్లు పినిశెట్టి ఛాయాదేవి, మరకాని సమతాకీర్తి, తెలుగు మహిళలు కరెడ్ల సుశీల, భవానీ, శేషుకుమారి, సుభాషిణి, షాహినా, హేమశ్రీ, రాధిక, మోకా గంటలమ్మ, గడ్డం రాజు, వంపుగడల చౌదరి, సమీర్ పాల్గొన్నారు. **పెడన :** సంక్రాంతి సంబరాలలో భాగంగా సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కె ట్‌యార్డులో శనివారం ముగ్గులు, మెహందీ, ఫ్యాన్సీ డ్రస్సుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పారిశ్రామికవేత్త గాజుల సాంబయ్య నాయుడు, ఏఎంసీ చైర్మన్ చారుమతి బహుమతులు అందజేశారు.